## డిగ్రీ కళాశాలల బంద్‌పై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి



పీడీఎస్‌యూ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మధు

అంబర్‌పేట, అక్టోబర్ 14 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఓయూ, కేయూ యూనివర్సిటీల పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు నిరవధికంగా కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చాయని, ఈ బంద్‌పై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి మధు, పొడపంగి నాగరాజు అన్నారు. పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం విద్యానగర్‌లోని సీపీ భవన్‌లో మధు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంద్‌తో మధ్యతరగతి విద్యార్థుల చదువు ఆగమయ్యే పరిస్థితి నెలకొందని అన్నారు. ఒకపక్క డిగ్రీ సెమిస్టర్ ఎగ్జామ్ ఫీజులు కట్టి ఎగ్జామ్స్‌కు విద్యార్థులు ప్రిపేర్ అవుతున్న వేళ డిగ్రీ కళాశాలలు బంద్ చేయడం దారుణమని అన్నారు. తక్షణమే తెలంగాణ ప్రభుత్వం డిగ్రీ కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద నవీన్, సహాయ కార్యదర్శులు గుర్రం అజయ్, నరసింహారెడ్డి, కోశాధికారి మామిడాల మహేశ్, కార్యవర్గ సభ్యులు తీగల శ్యామ్, మాదారపు నాగరాజు, మామిడాల ప్రవీణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం


కందుకూరులో మాట్లాడుతున్న అశోక్, శివరాంరెడ్డి

కందుకూరు, అక్టోబర్ 14: రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జంబుల శివరాంరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ మాజీ అధ్యక్షుడు పొలెమోని అశోక్ ముదిరాజ్ తెలిపారు. మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు. రైతు రుణమాఫీ, రైతు బంధు అమలు చేయడం లేదని విమర్శించారు. ఎకరాకు రూ.15వేల రైతు బంధు చెల్లిస్తామని చెప్పి మోసం చేసిందని వివరించారు. రూ.35వేల రుణం ఉన్నా.. సర్కార్ మాఫీ చేయలేదని అశోక్ ముదిరాజ్, శివరాంరెడ్డి వివరించారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెలిపారు. తమలాంటి రైతులకే రుణమాఫీ అమలు చేయకపోతే సామాన్య రైతుల పరిస్థితి ఎమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రైతులతో పాటు అన్ని వర్గాల వారికి న్యాయం జరిగిందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం దగా చేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసిన బీఆర్ఎస్ పార్టీ కందుకూరు మండల నాయకులు, కార్యకర్తలు


# ప్రజలకు రుణపడి ఉంటా..

### ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. దసరా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఎంతో రుణపడి ఉంటానని.. ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తకు అండగా ఉంటూ.. కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. ప్రతి ఒక్కరిని పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అభయం ఇచ్చారు. మహేశ్వరం నియోజకవర్గంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరించడానికి తన వంతు బాధ్యత నెరవేర్చుతానని పేర్కొన్నారు. రెండు రోజుల నుంచి జిల్లెలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం జన సందోహంగా మారింది. నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

### కార్యకర్తలకు అండగా ఉంటాం

కందుకూరు: బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ, అండగా ఉంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. దసరా పండగను పురస్కరించుకొని బీఆర్ఎస్ మండల నాయకులు సోమవారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, మాజీ చైర్మన్ ర్యాపాకు ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కాకి దశరథ ముదిరాజ్, డైరెక్టర్ సురుసాని శేఖర్‌రెడ్డి, పొట్టి ఆనంద్, సురుసాని సుదర్శన్‌రెడ్డి, బర్కం వెంకటేశ్, బ్రాహ్మణపల్లి శేఖర్ గుప్తా, సురుసాని కృష్ణారెడ్డి, హన్మంత్ రెడ్డి, ఎలుక సంజీవరెడ్డి, నవీన్, రాములు, సురుసాని రవీందర్‌రెడ్డి, రాజు, అశోక్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ బోయపల్లి దీపికా శేఖర్ రెడ్డి

## క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి


జాతీయ యోగా ఆసన పోటీలకు ఎంపికైన చిన్నారి పూజితను అభినందిస్తున్న తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, అక్టోబర్ 14: క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి తగిన విధంగా వారికి ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. జాతీయ యోగా ఆసన పోటీలకు ఎంపికైన చిన్నారి పూజితను సోమవారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన సన్మానించారు. అనంతరం ఉప్పల ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆమెకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూజిత జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కనబరుస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, పూర్ణ, డాక్టర్ ఏఆర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## అనాథ విద్యార్థులకు రూ.50వేల విరాళం



ఆర్కేపురం, అక్టోబర్ 14: ఎల్బీనగర్ చిత్రాలేఅవుట్‌లోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థుల వసతులకు, చదువులకు మన్సూరాబాద్ విజయశ్రీ కాలనీ అధ్యక్షుడు జొన్నాడ మోహన్‌రెడ్డి తల్లిదండ్రుల వర్ధంతి సందర్భంగా రూ.50వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. అమ్మా నాన్నలు కోల్పోయి ఎలాంటి ఆధారం లేక అనాథ విద్యార్థి గృహంలో అవకాశం రావడం విద్యార్థుల అదృష్టమని, గృహ కమిటీ కల్పించిన అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోని అహర్నిశలు కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ అధ్యక్షుడు మార్గం రాజేశ్ తదితరులు ఉన్నారు.

## ఆర్కేపురంలో మహాసత్సంగం


మహాసత్సంగంలో పాల్గొన్న ఇస్కాన్ బ్రహ్మచారి ప్రణవానంద దాస్, చిలుక ఉపేందర్‌రెడ్డి

ఆర్కేపురం, అక్టోబర్ 14: ఆర్కేపురం డివిజన్‌లో జరిగిన మహాసత్సంగము నగర సంకీర్తనలో భాగంగా అష్టలక్ష్మి దేవాలయం నుంచి శ్రీరామకృష్ణపురం కోపరేటివ్ సొసైటీ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇస్కాన్ బ్రహ్మచారి ప్రణవానంద దాస్, ఇస్కాన్ ప్రతినిధులు శ్రీనివాస్ అతిప్రియ దాస్, మాయ నర్సింగ్‌రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మి దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, చిలుక ఉపేందర్‌రెడ్డి, రామరావు, రమేశ్‌బాబు, గందే శ్రీకాంత్, విజయలక్ష్మి, నీలిమ, రాధ, సురేఖ, అర్చన, పుష్ప తదితరులు ఉన్నారు.


మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు, అక్టోబర్ 14: రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. అందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించిన అనంతరం దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు సభావత్ కృష్ణానాయక్, అందుగుల సత్యనారాయణ, రాకేశ్‌గౌడ్, బాబుగౌడ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మురుగుతో బేజారు

బడంగ్‌పేట, అక్టోబర్ 14: బడంగ్‌పేట ప్రధాన రహదారి పక్కన మురుగు దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి, విమానాశ్రయానికి నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే రహదారి మురికి కూపంగా మారితే బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల వద్ద సమస్యను వివరిస్తే తమ పరిధిలోకి రాదంటూ అందరూ తప్పించుకు తిరుగుతున్నారని.. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు బెలూన్లు ఎగరేసి అంతా స్వచ్ఛతగా ఉందని చాటింపేశారు. మురికి నీరు రోడ్లపైకి వచ్చినప్పడల్లా మోటార్లతో నాటిని తోడేసి చేతులు దులుపుకొంటున్నారు. నిత్యం మురుగునీరు నిలువ ఉండటంతో దోమలు, పందులకు నిలయంగా మారడంతో సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నామని.. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


బడంగ్‌పేట ప్రధాన రహదారి పక్కన మురికి కూపంగా మారిన దృశ్యాలు

## ప్రజావాణికి రెండు ఫిర్యాదులు

బండ్లగూడ, అక్టోబర్ 14 : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆయన ప్రజావాణి నిర్వహించారు. ప్రజావాణికి రెండు వినతులు రావడంతో వాటిని సంబంధిత అధికారులకు అందజేసి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

## గుంతల రోడ్లకు మరమ్మతులు చేయండి..

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 14: గుంతల రోడ్లపై నడవలేకపోతున్నామని, అధికారులు మరమ్మతు చర్యలు తీసుకోవాలని బీజేవైఎం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నాయకుడు సురెడ్డి వినయ్‌రెడ్డి కోరారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఉపకమీషనర్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. గగన్‌పహాడ్‌లో రోడ్డు సరిగ్గా లేదని పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, దాంతో దుర్గంధం వ్యాపిస్తుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మారగోని శివకుమార్, సామ రాహుల్‌రెడ్డి పాల్గొన్నారు.


అక్బర్‌బాగ్ చౌరస్తాలో నవజ్యోతి అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత పూజల్లో అసోసియేషన్ ప్రతినిధులు నాగరాజ్‌గౌడ్, చెంచురాం, సుమంత్ తదితరులు



మలక్‌పేట బీ-బ్లాక్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని నిమజ్జనానికి తరలిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు


# నిమజ్జనానికి దుర్గామాత

సైదాబాద్, అక్టోబర్ 14: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆలయాలు, మండపాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారిని సోమవారం నిమజ్జనానికి తరలించారు. నవరాత్రి వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించిన అనంతరం భక్తులు అమ్మవారి నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నిమజ్జనోత్సవంలో మంగళ వాయ్యిదాలతో, మహిళల దాండియా నృత్యాలతో, భక్తి కీర్తనల భజనలతో అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

### కన్నుల పండువగా అమ్మవారి ఊరేగింపు

మలక్‌పేట, అక్టోబర్ 14: పాత మలక్‌పేట డివిజన్‌లోని పోచమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత ఊరేగింపు టి.శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. పోచమ్మ దేవాలయం నుంచి ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపు మటన్ మార్కెట్, అగ్రికల్చర్ ఆఫీస్, వాటర్ ట్యాంక్, హౌజింగ్ బోర్డు కాలనీ, కాగజ్ కార్ఖానా, జంబాగ్ లిబర్టీ టైం బోర్డు వరకు కొనసాగింది. అనంతరం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమానికి ఏసీపీ శ్యాంసుందర్, సీఐ సైదులు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పీటీ.శంకర్ ముదిరాజ్, హరీశ్, శ్రీధర్ నరేంద్ర ముదిరాజ్, రాజు, గోపి, సత్యనారాయణ, వినయ్‌కుమార్, పవీణ్, ఆకాశ్, మహేశ్, శివ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


దుర్గామాత ఊరేగింపులో పాల్గొన్న ఏసీపీ శ్యాంసుందర్, సీఐ సైదులను సత్కరించిన ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పీటీ.శంకర్ ముదిరాజ్, శ్రీధర్ ముదిరాజ్


కందుకూరు: మండల కేంద్రంలో దుర్గామాత కరెన్సీ(నోట్ల దండ)కు వేలం పాట నిర్వహించగా రూ.40వేలకు దక్కించుకున్న బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాళ్ల కార్తీక్

## సభ్యత్వ నమోదుకు స్పందన


పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎంపీ రఘునందన్‌రావు, కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, అక్టోబర్ 14: హయత్‌నగర్‌లో చేపడుతున్న బీజేపీ సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన లభిస్తుందని మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు అన్నారు. సోమవారం హయత్‌నగర్ డివిజన్‌లోని పద్మావతి కాలనీలో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి ఎంపీ రఘునందన్‌రావు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రజల నుంచి అనూహ్య స్పందన ఏర్పడుతుందన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీజేపీ కార్పొరేటర్ల కృషితో ఇప్పటికీ 30వేల పైగా సభ్యత్వ నమోదు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కళ్లెం రవీందర్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్, ఎల్బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్, జిల్లా ఎస్సీ మెర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేశ్, డివిజన్ అధ్యక్షుడు ఉగాది ఎల్లప్ప, అధ్యక్షురాలు పార్వతి, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవిందచారి, నాయకులు గంగని శ్రీను, యాదగిరి, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.